తూర్పులో మురిపెంచెన్

- నియోజకవర్గ పరిధిలో కొత్తగా 1000 పింఛన్ల మంజూరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



నియోజకవర్గంలో కొత్తగా పింఛను మంజూరైన లబ్ధిదారులకు నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని(ఫైల్)

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో కొత్తగా 1000 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. వీటిలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు ఉన్నాయి. కొత్త లబ్ధిదారులకు రెండు రోజులుగా నియోజకవర్గంలో వార్డుల వారీగా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, ఇటీవల నియమించిన కన్వీనర్లు అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 15 వార్డులున్నాయి. జీవీఎంసీ జోన్–2, జోన్–3, జోన్–4 పరిధిలో ఈ వార్డులు ఉన్నాయి. జోన్–2లో 9వ వార్డు నుంచి 13 వార్డు వరకు 396 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. జోన్–3 పరిధిలో 15వ వార్డు నుంచి 23వ వార్డు వరకు 554 మందికి.. జోన్–4 పరిధి 28వ వార్డులో 50 పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఈ పింఛన్లను పాత లబ్ధిదారులతో పాటు కొత్తవారికి కూడా అందజేస్తున్నారు. అంతే కాకుండా ఈ నెల నుంచి రూ.2,500 ఉన్న పింఛన్ మరో రూ.250 అదనంగా పెంచి రూ.2,750 అందజేస్తుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో సంక్రాంతి పండగ ముందే వచ్చిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల వారీగా మంజూరైన కొత్త పింఛన్లు

9వ వార్డు	32 పింఛన్లు	15వ వార్డు	45 పింఛన్లు	20వ వార్డు	50 పింఛన్లు
10వ వార్డు	99 పింఛన్లు	16వ వార్డు	53 పింఛన్లు	21వ వార్డు	33 పింఛన్లు
11 వార్డు	111 పింఛన్లు	17వ వార్డు	56 పింఛన్లు	22వ వార్డు	69 పింఛన్లు
12వ వార్డు	69 పింఛన్లు	18వ వార్డు	70 పింఛన్లు	23వ వార్డు	81 పింఛన్లు
13వ వార్డు	85 పింఛన్లు	19వ వార్డు	97 పింఛన్లు	28వ వార్డు	50 పింఛన్లు
				మొత్తం	1000 పింఛన్లు

దరఖాస్తు చేయగానే పింఛన్ మంజూరైంది..



ఇటీవల వృద్ధాప్య పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేశా. ఎవరి చుట్టూ తిరగలేదు. అన్ని అర్హతలు ఉండడంతో ఈ నెల పింఛన్ మంజూరు చేశారు. బుధవారం సచివాలయంలో పింఛన్ డబ్బులు అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. మొదటి నెలలోనే రూ.2,750 అందుకున్నాను. ఇది నాకు ఎంతో భరోసా కలిగించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– నీలము గోపాలకృష్ణ, ఆరిలోవ ప్రాంతం, కనకదుర్గానగర్, 12వ వార్డు

వాడవాడలా పింఛన్ల పంపిణీ


12వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లు అందిస్తున్న కార్పొరేటర్ రోహిణి, నాయకులు


కొత్త పింఛన్‌దారులతో 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి


16వ వార్డులో సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు, మొల్లి అప్పారావు


15వ వార్డులో కొత్త పెన్షనర్లకు పింఛన్ సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, గిరిబాబు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బంది, కన్వీనర్లతో కలసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. వార్డులో కొత్తగా 69 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, మోహన్, సంతోష్, సుజాత, రాజులమ్మ, గోవిందమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మద్దిలపాలెం: కొత్త పింఛన్ల మంజూరుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి బుధవారం జీవీఎంసీ 16వ వార్డు రజక వీధి సచివాలయం పరిధిలో లబ్ధిదారులతో కలిసి ఏపీఐఐసీ డైరెక్టర్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మొల్లి అప్పారావు క్షీరాభిషేకం చేశారు. లబ్ధిదారులు జై జగన్, థ్యాంక్యూ సీఎం సర్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. వార్డు కన్వీనర్లు పోలరత్నం, పార్వతి, సంధ్య, జగదీశ్వరి, కన్నారావు, ఫిరోజ్, సింహాద్రి, వెంకటరావు, నాగభూషణరాజు, నాయుడు, వలంటీర్లు పాల్గొన్నారు.

15వ వార్డులో..

జీవీఎంసీ 15వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్లు నరాల సత్తిబాబు, ఉషా, గొలగాని త్రినాథ్, నారాయణరావు, సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

23వ వార్డులో కొత్త పెన్షన్ల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పెన్షన్లను జీవీఎంసీ 23వ వార్డులో బుధవా రం లబ్ధిదారులకు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యారెడ్డి అందజేశారు. పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసిందని కార్పొరేటర్ అన్నారు. జై జగన్ అంటూ నినాదాలతో లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ప్రభుత్వ సలహాదారు సజ్జలకు శుభాకాంక్షలు


సజ్జలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర నాయకులు

మద్దిలపాలెం : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి బుధవారం విజయవాడలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డిని కూడా కలిసి వారు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా 19వ పాసుర విన్నపం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం 19వ పాసుర విన్నపాన్ని వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆరాధన, శ్రీగోదా అష్టోత్తర శతనామావళి, అనంతరం కల్యాణ మండపానికి సహస్ర దీపాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. 365 ఒత్తులు వెలిగించి దీపారాధన చేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అక్కరమాని, చంద్రమౌళి తదితరులు

ఎంవీపీ కాలనీ: చినవాల్తేర్‌లోని సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు బుధవారం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.15 లక్షల వ్యయంతో చినవాల్తేర్ ఫిష్ మార్కెట్‌ను ఆనుకొని సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ ఆధునికీకరించనున్నట్టు తెలిపారు. త్వరితగతిన ఈ పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆమె సూచించారు. అనంతరం ఫిష్ మార్కెట్ పరిసరాలను అక్కరమాని పరిశీలించారు. మార్కెట్ ఆధునికీకరణకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు భాగ్యానంద్, కాంట్రాక్టర్ చంద్రమౌళి, ఏఈ శిరీషా, పలువురు వార్డు నాయకులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ: చీటీల పేరుతో స్థానికుల నుంచి భారీగా నిధులు సమీకరించి కుచ్చు టోపీ పెట్టిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పుఘర్‌తో పాటు ఎంవీపీ కాలనీ, వాసవానిపాలెం ప్రాంతాలకు చెందిన వారి నుంచి వి.సూర్యకుమారి అనే మహిళ దసరా, పప్పులు, లాటరీ చీటీల పేరుతో రూ.40 లక్షలకు పైగా వసూలు చేసింది. కొంత కాలంగా చీటీల డబ్బులు చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతుండడంతో స్థానికులు నిలదీశారు. పలువురు బాధితులు బుధవారం ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ ఎదుట తమకు న్యాయం చేయాలంటూ నిరసనకు దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యకుమారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

బీసీల జాగృతి, సాధికారతపై సదస్సు నేడు

ఎంవీపీ కాలనీ: ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ ఆధ్వర్యంలో బీసీల జాగృతి, సాధికారతపై విశాఖ వేదికగా సదస్సు నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హనుమంతు లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్ రోడ్డులోని బ్లాక్ అండ్ వైట్ హోటల్లో గురువారం ఉదయం ఈ సదస్సు జరగనుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి బీసీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయంగా పాలన

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని
- 23వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: పేదల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్రంలో సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం 23వ వార్డు చైతన్యనగర్‌లో కార్పొరేటర్ గుడ్ల విజయసాయితో కలిసి ఆమె నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాల వివరాలతో రూపొందించిన కరపత్రాలను అందజేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సొంతింటి కలను నెరవేర్చారని కొనియాడారు. అయినా నచ్చని ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తూ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అక్కరమాని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్ల సత్యారెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మరడ అప్పారావు మృతికి పలువురి సంతాపం


మరడ అప్పారావు(ఫైల్)

ఎంవీపీ కాలనీ: పెదవాల్తేర్ గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు మరడ అప్పారావు అకాల మరణంపై పలువురు స్థానిక నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. 1947లో జన్మించిన అప్పారావు ఫారెస్ట్, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. 1981–86 మధ్య బీజేపీ తరఫున జీవీఎంసీ కార్పొరేటర్‌గా గెలుపొందారు. 1992, 2004లలో కూడా కార్పొరేటర్‌గా అప్పారావు సేవలందించారు. ఇటీవల కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం మృతి చెందారు. పెదవాల్తేర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పలువురు నివాళులర్పించారు. గురువారం కుటుంబ సభ్యుల సమక్షంలో అప్పారావు అంత్యక్రియలు జరగనున్నాయి.

క్రీడలు

కరాటే చాంపియన్‌షిప్ బ్రోచర్ ఆవిష్కరణ


కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఈ ఏడాది మే నెలలో విశాఖలో జరగనున్న ఇండో నేపాల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పెదగదిలిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఏపీ వాడే–రూయ కరాటే డో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కరాటేతో పాటు అన్ని రకాల క్రీడా పోటీలకు విశాఖ అనువైనదన్నారు. కరాటే పోటీల నిర్వాహక ఆర్గనైజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో స్వర్ణ భారతీ ఇండోర్ స్టేడియంలో మే 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు కరాటే పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోపాలరావు, వెంకటరావు, కరాటే మాస్టర్ చిన్నారావు, రమణమూర్తి, నూకరాజు హరినాథరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మాధవ్‌కు పంచకర్ల పరామర్శ


పీవీ చలపతిరావు చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న పంచకర్ల రమేష్‌బాబు

మద్దిలపాలెం: బీజేపీ సీనియర్ నాయకుడు పీవీ చలపతిరావు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. పిఠాపురం కాలనీలో పీవీ స్వగృహానికి బుధవారం వచ్చిన ఆయన ఎమ్మెల్సీ మాధవ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చలపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజుబాబు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూముల హక్కుల పరిరక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ రమేష్

మధురవాడ: ప్రభుత్వ భూముల పరిరక్షణతోపాటు ప్రైవేటు వ్యక్తుల భూ హక్కుల పరిరక్షణకు సమగ్ర రీసర్వే ఎంతో దోహదపడుతుందని నోడల్ అధికారి అనీల్, జీవీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ (రెవెన్యూ) పి.రమేష్ అన్నారు. సమగ్ర భూ సర్వే, ప్రభుత్వం నిర్దేశించిన 6ఎ, 6ఏఏ సంబంధించిన వివరాలపై సచివాలయ, ఇతర సిబ్బందికి బుధవారం సాయంత్రం పీఎంపాలెంలోని అవంతి ఫంక్షన్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే ఏ విధంగా చేయాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజువలైజేషన్ ద్వారా వివరించారు. సర్వే అనంతరం అన్ని వివరాలు రికార్డుల్లో పొందుపరచాలని సచివాలయ అడ్మిన్‌లకు సూచించారు. భవిష్యత్‌లో ఈ సర్వే చాలా కీలకమని, ప్రతి ఒక సచివాలయ కార్యదర్శి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఆర్ఐలు బి.రమేష్, ఎమ్.రాజు, బి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్ నుంచి విద్యార్థి అదృశ్యం


అజ్జరపు వెంకట హేమశేఖర్

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి అజ్జరపు వెంకట హేమశేఖర్(14) మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో స్కూల్ నుంచి అదృశ్యమయ్యాడు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి నారాయణ విద్యా సంస్థల హాస్టల్‌లో ఉంటున్నాడు. స్కూల్ నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో తండ్రి వెంకట సాయిరమణ ఆందోళన వ్యక్తం చేస్తూ భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంధువులు, చుట్టుపక్కల స్నేహితుల ఇళ్లలోనూ వెతికారు. దీనిపై స్కూల్ యాజమాన్యం నోరు మెదపడం లేదని కుటుంబ సభ్యులు వాపోయారు. స్కూల్ నుంచి బయటకు వెళ్లిన సమయంలో హేమశేఖర్ బ్లూ జీన్ ప్యాంటు, గళ్ల చొక్కా, మాస్క్ ధరించి ఉన్నట్టు స్కూల్ సీసీ కెమెరాల్లో నమోదయింది. భీమిలి హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వంశీకృష్ణశ్రీనివాస్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు పెనుమత్స శ్రీదేవి వర్మ, ట్రస్ట్‌బోర్డ్ ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్, 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి ఆయన వెంట ఉన్నారు.

ఏయూ సమాచారం

మూల్యాంకన కేంద్రం పరిశీలన


మూల్యాంకన కేంద్రం పరిశీలిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం ఉదయం పరిశీలించారు. మూల్యాంకన ప్రక్రియను వేగవంతం చేసేలా కొత్తగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం కేంద్రం పరిసరాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని యూనివర్సిటీ ఇంజినీర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, వజీర్ మహ్మద్, యూనివర్సిటీ ఇంజనీర్స్ ఆర్.శంకరరావు, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సమాజంపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఉదయం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ మెంటార్ ట్రెనింగ్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువతను భాగం చేయాలని కోరారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి రెండూ సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఆలోచన సరళిలో మార్పు తీసుకురావడానికి కృషి జరగాలన్నారు. కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ మాట్లాడుతూ అధ్యాపకులు మార్పునకు వాహకాలుగా నిలుస్తారన్నారు. విద్యార్థులను కమ్యూనిటీ సర్వీస్ దిశగా నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్న తీరును తెలియజేశారు. రిసోర్స్ పర్సన్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశం కోసం పాటు పడేలా యువతను తీర్చిదిద్దడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలు డిగ్రీ కళాశాలలకు చెందిన 68 మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.

లెర్నర్ పోర్టల్‌లో కోర్సు మెటీరియల్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రంలో 2022–23 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు కోర్సు మెటీరియల్‌ను లెర్నర్ పోర్టల్‌లో పొందుపరిచారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో దీనిని లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు తమ గుర్తింపు నంబరును నమోదు చేసి కోర్సు మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజోలు ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్


ఉత్తర్వులు స్వీకరిస్తున్న కుమార్‌రాజా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం పరిశోధక విద్యార్థి పాలపర్తి కుమార్‌రాజాకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య నల్లా సత్యనారాయణ పర్యవేక్షణలో ×హిందీ దళిత్ ఆత్మ ఆథావో మే అభివ్యక్త్ వ్యక్తిత్వ వికాస్×అంశంపై ఆయన జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను కుమార్‌రాజా స్వీకరించారు. ప్రస్తుతం కుమార్‌రాజా రాజోలులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల హిందీ జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కార్యక్రమం నిర్వహించారు.